మేరెడ్డి సురేందర్‌రెడ్డికి ప్రముఖుల నివాళి


సురేందర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నిడమనూరు, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని మారపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేరెడ్డి సురేందర్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన భౌతికకాయాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరి జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు యడవెల్లి రంగసాయిరెడ్డి, అంకతి సత్యం, నందికొండ రామేశ్వరి, మేరెడ్డి వెంకట్‌రావుల్ రెడ్డి, అంకతి వెంకట్‌రమణ, శివ మారయ్య, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

● సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, ఏప్రిల్ 15 : నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా మంగళవారం హాలియా లక్ష్మీనర్సింహాగార్డెన్‌లో నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి హాజరు కానున్నట్లు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి సాగర్ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు హాజరు కావాలని కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

గుర్రంపోడ్ : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని మంగళవారం హాలియాలోని లక్ష్మీ నర్సింహా గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీసీ కులసంఘాల ఐక్యవేదిక జిల్లా కమిటీ ఎన్నిక

కమిటీని ప్రకటిస్తున్న వేదిక జిల్లా అధ్యక్షుడు రవి గౌడ్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 15 : బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పాల కూరి రవిగౌడ్ ప్రకటించారు. సంఘం ఉపాధ్యక్షులుగా రాజరికం నరసింహాచారి, నరసింహ, సుంకరి సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జక్కుల సుధాకర్‌యాదవ్, కార్యదర్శులుగా విజయ్, దశరథ గౌడ్, నాంపల్లి లక్ష్మణ్, భిక్షం, జిల్లా శేఖర్, జిల్లా అధికార ప్రతినిధులుగా వెంకట చేతన్, ఉయ్యాల వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు తెలిపారు. యువజన విభాగం అధ్యక్షుడిగా దోరపల్లి హరిశంకర్, పట్టణ అధ్యక్షుడిగా బత్తుల శ్రీశైలంను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రాజరికం నరసింహాచారి, సుధార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కరుణాకర్‌రెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

చిట్యాల, ఏప్రిల్ 15 : మండలంలోని వెల్మినేడు గ్రామానికి చెందిన గోధుమగడ్డ కరుణాకర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న కరుణాకర్‌రెడ్డి మిత్రులు(1998–99 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు) సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.66 వేలను కరుణాకర్‌రెడ్డి కూతురి పేరుమీద ఫిక్స్ చేసి బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మాటకారి మహంకాళి, నాతి శ్రీనివాస్, చెరుకు పాండు, గుండాల జంగయ్య, బుట్టి వెంకటేశ్, అరూరి రమేశ్, శ్రీనివాస్, బొంతల నరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఐలమ్మ పాల్గొన్నారు.

20న చందంపేట మండల సర్వసభ్య సమావేశం

చందంపేట, ఏప్రిల్ 15 : ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పార్వతీచందునాయక్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పోస్టల్ ఉద్యోగి అదృశ్యం

నిడమనూరు, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో పోస్ట్ ఉమెన్‌గా పని చేస్తున్న యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన రమావత్ ఉదయశ్రీ (21) తొమ్మిది నెలలుగా నిడమనూరు పోస్టాఫీస్‌లో పోస్ట్ ఉమెన్‌గా పని చేస్తున్నది. మిర్యాలగూడలోని తన బాబాయి ఇస్లావత్ రవి ఇంట్లో ఉంటూ విధులకు హాజరవుతోంది. ఈ నెల 12న డ్యూటీకి వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి బయల్దేరింది. విధులకు హాజరు కాలేదు. తిరిగి ఇంటికి రాలేదు. ఉదయశ్రీ ఆచూకీ కోసం బంధువుల ఇండ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి రమావత్ శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

నందికొండలో నీటి కష్టాలు

● వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా

మున్సిపాలిటీ ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న పైలాన్ కాలనీవాసులు

నందికొండ, ఏప్రిల్ 15 : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పక్కనే ఉన్నా నందికొండ మున్సిపాలిటీ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. పైలాన్, హిల్‌కాలనీలకు ఎన్నెస్పీ అధికారులు తాగునీటిని నీటి సరఫరా చేస్తున్నారు. అయితే ఆయా కాలనీలకు నీటిని సరఫరా చేసే ఫిల్టర్ హౌస్ మోటర్లు మొరాయిస్తుండడంతో కాలనీ వాసులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పైలాన్‌కాలనీ వాసులకు నీటిని సరఫరా చేసే పంపు చెడి పోవడంతో వారం రోజులుగా కాలనీ ప్రజలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా, మరి కొందరు పబ్లిక్ ట్యాంకుల వద్ద నీటిని పట్టుకొని వెళుతున్నారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఫిల్టర్ హౌస్ ఏఈ భిక్షంను వివరణ కోరగా పైలాన్‌కాలనీకి నీటి సరఫరా చేసే పంపు పాడైపోవడంతో వారం రోజులుగా నీటి సరఫరా నిలిచి పోయిందని తెలిపారు. కొత్త పంపును ఏర్పాటు చేసినా.. పంపు మొరాయిస్తుందని పేర్కొన్నారు. త్వరగా బాగు చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

● ఆర్డీఓ రవి

ఎల్లారెడ్డిగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 15 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని ఆర్డీఓ ఎన్. రవి ఆదేశించారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. రైతులకు కల్పిస్తున్న వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడువకుండా చూడాలని ఆదేశించారు. సీరియల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలని, కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట డీటీ ఆజాంఖాన్, ఆర్ఐ తరుణ్, ఏఈ విజయలక్ష్మి, సీఈఓ వెంకటయ్య ఉన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

● ఎంపీపీ భగవాన్‌నాయక్

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భగవాన్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 15: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో 34 గ్రామపంచాయతీల్లో, ఆవాస గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పురోగతిని సభలో చదివి వినిపించారు. సమావేశంలో తాసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ రమేశ్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాను చనిపోతూ... ఐదుగురికి ప్రాణదానం

అంబేడ్కర్ వెంకటయ్య(ఫైల్)

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 15 : తాను చనిపోతూ తన అవయవాలను దానం చేసి మరో ఐదుగురికి ప్రాణం పోశాడు కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన అంబేడ్కర్ వెంకటయ్య. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎమ్మార్పీస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి అంబేడ్కర్ వెంకటయ్య రంగారెడ్డి జిల్లాలోని తుర్కయాంజల్‌లో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం తుర్కయాంజల్ నుంచి కొండమల్లేపల్లికి బైక్‌పై వస్తుండగా మార్గ మధ్యంలో ఆగాపల్లి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. వెంకటయ్య తలకు బలమైన గాయం కావడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దాంతో వెంకటయ్య అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. నిమ్స్ ఆస్పత్రి వైద్యులు వెంకటయ్యకు చెందిన నేత్రాలు, లివర్, గుండె, కిడ్నీలు, ఊపిరి తిత్తులను సేకరించారు. వాటి ద్వారా మరో ఐదుగురికి ప్రాణదానం చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

గ్రామాల్లో బోర్లకు మరమ్మతు చేయాలి

● ఎంపీపీ పోకల శ్రీవిద్య

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని, చెడిపోయిన బోర్లను బాగు చేయాలని ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. పశువులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తొట్లలో నీటిని నింపాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, ఎంపీడీఓ తిరుమలస్వామి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 15 : అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 13వ తేదీ రాత్రి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు డీటీసీఎస్ హన్మంతు వెంకటేశ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలం సారబండతండాకు చెందిన ఇస్లావత్ నవీన్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తి ప్రాంతానికి తరలిస్తుండగా దేవరకొండ మండలం ఇద్దంపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. సదరు బియ్యాన్ని సివిల్ సప్లై గోదాంకు తరలించి 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

లావూడి తండాలో ..

మిర్యాలగూడ రూరల్ : మండలంలోని లావూడి తండాలో వినియోగదారుల నుంచి సేకరించి ఇంట్లో నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ నరేశ్ తెలిపారు. తండాకు చెందిన లావూడి శంకర్ బియ్యం కొనుగోలు చేసి అదే తండాకు చెందిన లావూడి మీర ఇంట్లో నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లై ఆర్ఐ సత్యనారాయణసింగ్ పంచనామా నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారని, ఈ మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 15 : మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మాలే సత్యంరెడ్డి కోడలు పల్లవి అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి గ్రామానికి వెళ్లి పల్లవి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బీవీ.రమణరాజు, నాయకులు కూన్‌రెడ్డి లింగారెడ్డి, తెనాలి సాయిరాంరెడ్డి, మండలి శ్రీనివాస్‌యాదవ్, పాదిల మల్లయ్యయాదవ్ ఉన్నారు.

17న సాయిమందిరంలో శ్రీరామనవమి వేడుకలు

నకిరేకల్, ఏప్రిల్ 15 : మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సాయిమందిరంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందిరంలోని కమ్యూనిటీ హాల్‌లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, వైస్ చైర్మన్లు తొనుపునూరి శ్రీనివాస్, గట్టు శ్యామ్‌సుందర్, సహాయ కార్యదర్శులు బానాల రాంరెడ్డి, తొనుపునూరి రాంబాబు పాల్గొన్నారు.

బీజేపీ మానిఫెస్టోలో బీసీల ప్రస్తావనే లేదు

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 15 : బీజేపీ ఎన్నికల మానిఫెస్టోలో బీసీల ఊసే లేకపోవడం బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ జనాభాలో సగానికి పైగా బీసీలు ఉన్నారని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు బీసీలకు పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే గానీ వారి సంక్షేమానికి కృషి చేయడం లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు, కులగణన, బీసీల అభివృద్ధి వంటి వాటిపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. బీసీలను విస్మరించిన బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

చందంపేట, ఏప్రిల్ 15 : మండలంలోని వెంకటినాయక్‌తండాకు చెందిన సభావత్ రవీందర్ సోమవారం మృతి చెందాడు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండాకు వెళ్లి రవీందర్ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, రమావత్ మోహన్‌కృష్ణ, తులసీరాం, వడ్త్య బాలు, మహేశ్, శోభన్, కృష్ణ ఉన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి యువకుడి మృతి


శ్రవణ్‌కుమార్ (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 15 : మండలంలోని వట్టిమర్తికి చెందిన నూనె శ్రవణ్‌కుమార్ (22) సోమవారం చిట్యాల శివారులోని స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందాడు. చిట్యాల 2వ ఎస్ఐ కె. లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శ్రవణ్‌కుమార్ తన మిత్రులతో కలిసి స్థానిక కేకేఆర్ స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తల్లి బుగ్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేషనల్ టాలెంట్ సెర్చ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

నకిరేకల్ : ప్రతిభ కనబర్చిన శ్రీ చైతన్య విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 15 : ఇటీవల జరిగిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ చాముండేశ్వరి తెలిపారు. ప్రతిభ కనబర్చిన పాఠశాలకు చెందిన కె. భరత్, చేతన్, జతిన్‌కు సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీజీఎం సుధాకర్, కోఆర్డినేటర్ నాగేంద్ర, డీన్ కాటమరాజు, ప్రైమరీ ఇన్‌చార్జి ఉపేందర్, గీత, మారుతి, పీఈటీ సైదులు, శ్రీదేవి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించాలి

● ఎంపీపీ విజయలక్ష్మి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

తిప్పర్తి, ఏప్రిల్ 15: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు దృష్టి సారించాలని తిప్పర్తి ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తాగునీటి వనరులు ఎండిపోయిన చోట రైతుల బోర్లను అద్దెకు తీసుకొని ప్రజలకు నీరందించాలన్నారు. వేసవిలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు

గుర్రంపోడ్, ఏప్రిల్ 15: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా కూపన్లు కొనుగోలు చేసిన వారికి సోమవారం లక్కీడ్రా తీసి విజేతలకు ఆలయ చైర్మన్ జాల పెద్ద సత్తయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్‌గౌడ్ బహుమతులు అందించారు. జాల జయకు మొదటి బహుమతిగా బైక్, రెండో బహుమతిగా రేపాక నిహారికకు 5 గ్రాముల బంగారం, మూడో బహుమతి విజేత తెలుకుంట్ల సరితకు ఎల్ఈడీ టీవీని అందించారు. కార్యక్రమంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ వెలుగు భిక్షం, జాల చిన సత్తయ్య, పొనుగోటి నర్సింహారావు, చలమల్ల కొండల్, జాల యాదయ్య, రావుల సైదులు,వెలుగు యాదయ్య పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ఆర్టీసీ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 15: వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో క్లబ్ ఐఈసీ తెడ్ల జవహర్‌బాబు, రేణుక దంపతులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం పాల్, ఐపీసీ మిర్యాల శత్రయ్య, సెక్రటరీ గుండా మల్లయ్య, కోశాధికారి జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ గుండా వెంకటేశ్, చీదళ్ల నరేందర్, ఎస్ఎం భిక్షమయ్య, జానకిరాంరెడ్డి, జయలక్ష్మి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడి జింక మృతి

గాయపడిన జింకకు వైద్యం చేస్తున్న అధికారులు

మర్రిగూడ, ఏప్రిల్ 15 : కుక్కల దాడిలో గాయపడి జింక మృతి చెందిన ఘటన మండలంలోని దామెర భీమనపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఫారెస్ట్ సెక్షన్ అధికారి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని ఇండ్ల సమీపంలోకి వచ్చిన జింకపై కుక్కలు దాడి చేయగా రెండు కాళ్లు విరిగిపోయాయి. గ్రామానికి చెందిన జిల్లా తిరుమలేశ్ గాయపడిన జింకను మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తరలించాడు. వైద్యులు చికిత్స చేసినప్పటికీ రెండు గంటల తర్వాత జింక మృతి చెందింది. బీట్ అధికారి నవీన్, వెటర్నరీ అసిస్టెంట్ ఎల్లేశ్‌తో పాటు గ్రామస్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి జింక కళేబరాన్ని ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీరామనవమికి విగ్రహాలు సిద్ధం

నల్లగొండలో విక్రయానికి ఉంచిన విగ్రహాలు

రామగిరి, ఏప్రిల్ 15 : ఈ నెల 17న శ్రీరామనవమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన విగ్రహాలను కొంతమంది వ్యాపారులు నల్లగొండలోని పలు ప్రాంతాల్లో అమ్మకానికి ఉంచారు. సీతారామ, లక్ష్మణ, హనుమంతుడి విగ్రహాలను విక్రయించారు. చాలా మంది కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

గ్రాడ్యూయేషన్‌డేలో పాల్గొన్న పాఠశాల చైర్మన్ లింగయ్యగౌడ్, విద్యార్థులు

ఘనంగా గ్రాడ్యూయేషన్ డే

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 15 : జిల్లా కేంద్రంలోని శ్రేష్ఠ పాఠశాలల